# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | SANGAREDDY




మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో అలుగు పారుతున్న అందుగులపల్లి పెద్దచెరువు

# ప్రాజెక్టులకు జలకళ

- మెదక్ జిల్లాలో మొత్తం 2694 చెరువులు
- అలుగు పారుతున్నవి 475
- వంద శాతం నిండినవి 827
- 165 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- ప్రభుత్వ సాయం అందించాలని కోరుతున్న అన్నదాతలు



మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో నిండుకుండలా పర్వతాపూర్ పెద్దచెరువు



మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో అలుగు పారుతున్న తిరుమలాపురం చెరువు



మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న మంజీరా

మెదక్, సెప్టెంబర్ 3 (నమస్తేతెలంగాణ): మెదక్ జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శని, ఆదివారాల్లో వర్షం బీభత్సం సృష్టించగా, సోమవారం ముసురు వాన కురిసింది. దీంతో జిల్లాలోని చెరువులన్నీ నిండిపోయాయి. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ చివరివారం వరకు చెరువులు అలుగు పారేవి కావు...కానీ సెప్టెంబర్ ప్రారంభంలోనే భారీ వర్షాలు పడటంతో మెజార్టీ చెరువులు నిండాయి. ఎడతెరిపి లేని వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరుతోంది. జూన్, జూలై, ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా భారీ వర్షపాతం నమోదైంది. దీంతో కొన్ని పంటలకు మేలు జరగ్గా, మరికొన్ని పంటలకు నష్టం జరిగింది. మెదక్ జిల్లాలో 752.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యధికంగా మెదక్‌లో 1041 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మనోహరాబాద్‌లో 545 మి. మీ వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

### ఘనపూర్, హల్దీ, రాయిన్‌పల్లి ప్రాజెక్టుల్లో నీళ్లు ఫుల్

మెదక్ జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన ఘనపూర్ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. వెల్దుర్తి సమీపంలో ఉన్న హల్దీప్రాజెక్టు, మెదక్ మండలం రాయిన్‌పల్లి ప్రాజెక్టు, మెదక్-కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న పోచారం డ్యామ్ పొంగిపొర్లుతున్నాయి. దీంతో ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంటుంది. ఘనపూర్ ఆనకట్ట పొంగడంతో ఏడుపాయల వనదుర్గమాత ఆలయం మూసివేశారు. జిల్లాలో 2694 చెరువులు ఉండగా 475 చెరువులు అలుగు పారుతున్నాయి. 25 నుంచి 50 శాతం నిండినవి 461 చెరువులు కాగా, 50 నుంచి 75 శాతం నిండినవి 931, 75 నుంచి 100 శాతం నిండినవి 827 చెరువులు ఉన్నాయని ఇరిగేషన్‌శాఖ డీఈఈ శివనాగరాజు తెలిపారు.

### 165 ఎకరాల్లో నీట మునిగిన పంటలు

ప్రస్తుత వానకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మూడు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో 165 ఎకరాల్లో మాత్రమే పంటలు నీట మునిగాయి. హవేళీఘనపూర్‌లో 65 మంది రైతులకు చెందిన 105 ఎకరాలు, బూర్గుపల్లిలో 15 మంది రైతులకు చెందిన 35 ఎకరాలు, రాజ్‌పేటలో 15 మంది రైతులకు చెందిన 25 ఎకరాల వరి పంటనీట మునిగింది. జిల్లాలో ఇప్పటి వరకు 233 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇందులో అత్యధికంగా కొల్చారం మండలంలో 21, చేగుంట మండలంలో 12, పెద్దశంకరంపేట మండలంలో 11, మెదక్ మండలంలో 10, పాపన్నపేట మండలంలో 10 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి.



మత్తడి దుంకుతున్న సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టు



సిద్దిపేట కమాన్ : అలుగు దుంకుతున్న సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లి తుమ్మలకుంట

# సిద్దిపేట జిల్లాలో మోస్తరు వర్షం

సిద్దిపేట, సెప్టెంబర్ 3: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావం వల్ల సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం వర్షం తెరిపి ఇచ్చింది. మధ్నాహ్యం తర్వాత చిరుజల్లులతో కూడిన వర్షంతోపాటు అక్కడకక్కడ మోస్తరు వర్షం పడింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు మత్తళ్లు దుంకుతున్నాయి. వర్షం ప్రభావంతో జిల్లాలోని పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోయాయి. గజ్వేల్ మండలం అక్కారంలోని కోనాపూర్ చెరువును కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్న దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 1.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కుకునూరుపల్లిలో 3.62 సెం.మీ, అత్యల్పంగా నారాయణరావుపేట మండలంలో 0.16 సెం.మీ వర్షం పడింది.



సిద్దిపేట కమాన్ : మత్తడి పారుతున్న సిద్దిపేట జిల్లా సిద్దిపేటలోని ఎర్రచెరువు



సంగారెడ్డి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కల వాగు

# పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు

- సంగారెడ్డి జిల్లాలో కూలిన 101 ఇండ్లు
- 1625 ఎకరాల్లో పంట నష్టం
- 683 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు
- సింగూరులోకి కొనసాగుతున్న వరద
- అలుగు పారుతున్న నల్లవాగు

సంగారెడ్డి సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పంటలు, రోడ్లు, ఇండ్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. పలుచెరువులు, కుంటలకు బుంగలుపడ్డాయి. జిల్లాలోని జలవనరుల్లోకి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరింది. సింగూరుప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండగా నల్లవాగు ప్రాజెక్టు అలుగు పారుతుంది. జిల్లాలోని 117 చెరువులు అలుగు పారుతున్నాయి. మంగళవారం జిల్లాలో 1.6 సెం.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. సిర్గాపూర్‌లో అత్యధికంగా 8.6 సెం.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 12 మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురవగా 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

### నల్లవాగు, సింగూరులోకి వరద

సింగూరు ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండగా నల్లవాగు ప్రాజెక్టు అలుగు పారుతుంది. పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులోకి 33,920 క్యూసెక్కుల నీరు వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.536 టీఎంసీలకు చేరుకుంది. నల్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటిమట్టం నిండి అలుగు పారుతుంది. జిల్లాలో 1769 చెరువులు ఉండగా 117 అలుగు పారుతున్నాయి. 321 చెరువులు పూర్తిగా నిండగా 366 చెరువులు 75 శాతం, 844 చెరువులు 50శాతం నిండాయి. సిర్గాపూర్ మండలం కడ్పల్‌లోని పులాయికుంట, సిర్గాపూర్‌లోని సాకిచెరువు, కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లిలోని నర్సయ్య చెరువులకు బుంగలుపడ్డాయి.

### 1625 ఎకరాల్లో పంట నష్టం

సంగారెడ్డి జిల్లాలోని 11 మండలాల్లోని 33 గ్రామాల్లో 1625 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. 20 ఎకరాల్లో వరి, 795 ఎకరాల్లో సోయాబీన్, 170 ఎకరాల్లో మినుము, 51 ఎకరాల్లో పెసర పంటలు దెబ్బతిన్నాయి. 226 ఎకరాల్లో కంది, 298 ఎకరాల్లో పత్తి, 17 ఎకరాల్లో చెరుకు, 48 ఎకరాల్లో కూరగాయ పంటలకు నష్టం జరిగింది. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో 683.76 ఎకరాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు, 83 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి.





సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గ్రామంలో దెబ్బతిన్న టమాట, పత్తి పంటలు

# శభాష్ పోలీస్

**మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు**



టేక్మాల్ మండలంలోని షాబాద్‌తండా సమీపంలో ఉన్న వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

అల్లాదుర్గం, సెప్టెంబర్ 3: వాగులో చిక్కుకున్న వ్యక్తిని పోలీసులు ప్రాణాలకు తెగించి కాపాడిన సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని షాబాద్‌తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాబాద్‌తండాకు చెందిన రమావత్‌నందు మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి తండాకు సమీపంలోని గుండువాగుకు వెళ్లాడు. వాగుదాటుతున్న క్రమంలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. వాగులో కొట్టుకుపోతూ మధ్యలో పెద్దగుండురాయి తగలడంతో దాన్ని గట్టిగా పట్టుకొని ఆగిపోయాడు. విషయం తెలుసుకున్న కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు క్విక్ రెస్పాన్స్ టీం(క్యూఆర్టీ) ఘటనా స్థలానికి చేరుకున్నది. టీం సభ్యులు మహేశ్, బండి శ్రీనివాస్, సురేశ్‌నాయక్, కృష్ణ, రమేశ్ కలిసి కల్వర్టు మధ్య వరకు వెళ్లి రమావత్‌నందుకు తాడు అందించారు. తాడు సాయంతో అతడిని వరద ప్రవాహం నుంచి బయటకు తీసుకొచ్చారు. వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన టీం సభ్యులను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ అభినందించారు.

# వైద్యులు అలసత్వం వహించొద్దు

- రోగులకు తక్షణమే వైద్య పరీక్షలు చేయాలి
- అందుబాటులో మందులు ఉంచుకోవాలి
- సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



సిద్దిపేట జిల్లా గజ్వేల్ దవాఖానలో పిల్లల వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, సెప్టెంబర్ 3: సీజనల్ వ్యాధులతో దవాఖానకు వచ్చే రోగుల పట్ల వైద్యులు అలసత్వం వహించొద్దని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వరంతో దవాఖానకు వచ్చే రోగులకు తక్షణమే డెంగీ పరీక్షలు చేసి వెంటనే వైద్యం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా దవాఖానలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి జ్వరాలతో వచ్చే వారికి చికిత్సలు అందించాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో కాలం చెల్లిన మందులు ఉపయోగించరాదన్నారు. డయాలసిస్ సేవల కోసం వచ్చే రోగుల జాబితాను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పిల్లల వార్డులో అప్రమత్తంగా ఉండి నవజాత శిశువులకు ఇంక్యూబేటర్ సేవలు అందించాలని, దవాఖానను శుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాలని సూపరింటెండెంట్ సాయికిరణ్‌కు సూచించారు. ఆర్డీవో బన్సీలాల్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్య పాల్గొన్నారు.

### కోనాపూర్ చెరువును పరిశీలించిన కలెక్టర్

భారీ వర్షాలతో నిండిన కోనాపూర్ చెరువును పరిశీలించి రెవెన్యూ అధికారులు, రైతులతో మాట్లాడి కలెక్టర్ మనుచౌదరి వివరాలు తెలుసుకున్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో సాగు చేసిన పంటలు మునిగిపోతున్న విషయాన్ని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు పూర్తిగా నిండి ప్రమాదకరంగా మారడంతో గండికొట్టి నీటిని కిందికి వదలాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. దీంతో వెం టనే గండికొట్టి నీటిని కిందికి వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలతో పూర్తిగా నిండిన చెరువులు, కుంటలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చెరువు కట్టలు తెగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నందున రైతులు వాటిని దాటకుండా అప్రమత్తం చేయాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈ చాందిరామ్, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ శ్రవన్, ఆర్ఐ కృష్ణ ఉన్నారు.

# చేతనైతే సాయం చేయండి..దాడులు సిగ్గుచేటు

**బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, సెప్టెంబర్ 3: ఖమ్మం జిల్లాలో వరదల్లో చిక్కుకున్న బాధితులను పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నక్రమంలో జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, జగదీశ్‌రెడ్డిలపై దాడులు చేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ చేతనైతే బాధిత కుటుంబాలకు సాయం చేయాలని, పరామర్శించేందుకు వెళ్లిన వారిపై దాడులు చేయడం కాంగ్రెస్ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం బీఆర్‌ఎస్ నైజమని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలపై దాడులు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, దాడులు చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ప్రజలు వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, సోయిలేని దద్దమ్మలా వ్యవహరిస్తుందన్నారు. సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మంత్రులు, సీఎంకు మధ్య సయోధ్య లేదని విమర్శించారు. గ్రామాల్లో ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే ప్రభుత్వం రూ.5లక్షల సాయం చేయాలని, వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన వాళ్ల కుటుంబాలకు రూ.25లక్షలు అందించాలన్నారు. భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సర్వే చేయించి సమగ్రమైన నివేదిక తెప్పించుకొని ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలన్నారు.

# ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులోని ఎల్లమ్మచెరువును పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే సతీశ్‌కుమార్

- దుకాణాలు, ఇండ్లలోకి వరద రాకుండా చూడండి
- వాననీరు మళ్లీ ముంచెత్తితే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబర్ 3: భారీవర్షాలతో హుస్నాబాద్ పట్టణంలోని పలు దుకాణాలు, ఇండ్లలోకి వరదనీరు రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడటం ఆవేదన కలిగించిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని నిండుకుండలా మారిన ఎల్లమ్మచెరువు, మత్తడి ప్రాంతాన్ని, వరదతో కొట్టుకుపోయిన పందిల్ల రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలతో రైతాంగానికి భారీగా మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు వివరించారు. పట్టణానికి వరద పోటెత్తి రావడంతో దుకాణాదారులు, ఇండ్లలోకి వరద చేరి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడం దురదృష్టకరమని, మరోసారి వరద రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వరద రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పట్టణాన్ని వరద ముంచెత్తితే తప్పకుండా ప్రజల పక్షాన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు నష్టం జరగకుండా చూడాలన్నారు. అనంతరం స్థానిక వ్యాపారస్తుడు నీరుమల్ల నాగరాజు ఇంటికి వెళ్లి పట్టణంలో వరదవల్ల జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధు, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, కౌన్సిలర్లు గోవిందు రవి, పెరుక భాగ్యారెడ్డి, బొజ్జ హరీశ్, నాయకులు వంగ వెంకట్రామ్‌రెడ్డి, పూదరి రవీందర్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్, వాల నవీన్, అయిలేని శంకర్‌రెడ్డి, బోజు రవి, బొల్లి శ్రీనివాస్, యాంసాని శ్రీనివాస్, రాజునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జలకళ సంతరించుకున్న సింగూరు ప్రాజెక్టు

# సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్కల్, సెప్టెంబర్ 3: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు 24,301 క్యూసెక్యుల నీరు రాగా సాయంత్రం ఆరుగంటల వరకు సుమారు 10వేల క్యూసెక్యుల నీరు వచ్చినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వరద తీవ్రత 33,920 క్యూసెక్యులు వస్తుందన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా అధికారులు ప్రాజెక్టు వద్ద వరదను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. వరద ఎక్కువ వస్తున్న సందర్భంగా సందర్శకుల తాకిడి ఎక్కువైంది కానీ ప్రాజెక్టుపైకి అనుమతించడం లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 33,920 క్యూసెక్యులు కొనసాగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 21.536 టీఎంసీల నీరు నిల్వ ఉండగా అవుట్ ఫ్లో 401 క్యూసెక్యులు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.



సంగారెడ్డి జిల్లా కల్పగూర్ మంజీరా డ్యామ్‌లోకి వచ్చిన భారీ వరద



సంగారెడ్డి మండలం చిమ్మాపూర్‌లో మత్తడి దుంకుతున్న చెరువు

# మున్సిపాలిటీల్లో పలు గ్రామాలు విలీనం

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- పటాన్‌చెరు మండలంలో ఐదు గ్రామాలు తెల్లాపూర్‌లోకి...
- ఆరు గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోకి...

పటాన్‌చెరు, సెప్టెంబర్ 3: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలను సమీపంలోని మున్సిపాలిటీల్లోకి విలీనం చేస్తూ మంగళవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి, కర్ధనూర్, పోచారం, పాటి, ఘనపూర్ గ్రామాలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో, అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ తండా, ఐలాపూర్, పటేల్‌గూడ, దాయర, కృష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్‌ను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. పటాన్‌చెరు మండలంలోని ఐదు గ్రామాలు, అమీన్‌పూర్ మండలంలోని ఆరు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. మున్సిపల్ అధికారులకు పంచాయతీ రికార్డులు వెళ్తున్నాయి. డీనోటిఫై చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఉత్తర్వ్యులు జారీ అయ్యాయి.